

సూర్యుడికి చీకటేమిటి?

పంతుల జోగారావు

చంద్రకి విసుగ్గా ఉంది. ఆలోచనల్తో తలవేడెక్కిపోయి దిమ్ముగా వుంది. అసహనంగా మంచంమీద అటూ యిటూ దొర్లుతోంది. ఆమెకి అందరిమీద కోపంగా వుంది. తనమీద తనకే చిరాగ్గా వుంది. ప్రక్కనే బొంతమీద రజని

వాళ్ళెరక్కుండా నిద్రపోతోంది. ఏడేళ్ళ ఆ పిల్లని చూసి భారంగా నిట్టూర్చింది చంద్ర.

ఏడుపొస్తోంది.

ఆమెకి తెలీకుండానే కన్నీరు ఆమె చెంపలమీద నుంచి జారి చారలు కట్టింది

సీలింగుఫేను రొదచేస్తూ, తిరుగుతోంది. ఆ శబ్దం చంద్రకి భరించలేనిదిగా తోచింది. తలలో సూదుల్తో పొడుస్తున్నట్టుగా దాని కిర్రు శబ్దం వినలేకపోతూవుందామె ఫేను కట్టేద్దామా అనిపించింది కాని ఉక్కపోతతో ఊపిరాడదు. చెమట్లుపట్టి, శరీరమంతా ముద్దగా తడిసిపోతోంది. ఆ పరిస్థితి మరీ రోత.

చంద్రకి వంటింటి వసారాలోనుంచి మాటలు వినిపిస్తున్నాయి.

అమ్మ సన్నగా ఏదో గొణుగుతోంది. మధ్య మధ్య ఆవిడ గొంతు దుఃఖంతో పూడ్చుకుపోవడం తెలుస్తూనే వుంది. మధ్యలో నాన్న కలగజేసుకుని ఏదో అంటున్నాడు. వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో తనకి తెలుసు తెరలు తెరలుగా వచ్చే దుఃఖాన్ని బిగబట్టుకోడానికి ప్రయత్నిస్తూ ఆ మాటలు అవతలి గదిలో వున్న తనకి వినిపించేస్తాయేమోనన్నట్లుగా అమ్మ బొంగురు గొంతుతో మాట్లాడుతోంది.

ఛీ. వెధవకొంప. ఎన్నాళ్ళని యిలా భయాల తెప్పలమీద ప్రయాణించడం? తల్లీ, తండ్రీ, చెల్లీ– అందరూ తనతో బెంగగా బెరుగ్గా ఒదిగిపోతూ ప్రవర్తించడం– ఎంత దుస్సహంగా వుంది!

ఎవరూ తనతో ఫ్రీగా వుండలేరు. ఎక్కడ ఏ మాట జారితే తమ మధ్య నిలదొక్కుకునివున్న ఆర్థిక సంబంధాల దారం పుటుక్కున తెగిపోతుందోనన్న బెంగ. అంతేనా? అది తప్ప తమ మధ్య మరే అనుబంధమూ లేదా!

ఇంట్లో బియ్యం నిండుకుంటే– బియ్యం లేవని చెప్పడానికి జంకుతూ, 'చంద్రా, ఆ బియ్యం డబ్బాలోనుంచి ఓ గ్లాసుడు కొలిచి తీసుకురామ్మా ఎసరు మరుగుతోంది' అని కేకేస్తుంది అమ్మ. బియ్యం నిండుకున్నాయనీ– ఆ పూటకి మాత్రమే వున్నాయనీ – ఆవిడ ఉద్దేశ్యాన్ని అలా తెలియజేస్తుంది.

ఓణీలు చిరిగిపోయేయని చెప్పడానికి బదులు– ఆ చిరుగుల ఓణీలోంచి పెల్లుబికే అందాల్ని తనముందు ప్రదర్శిస్తూ అదే పనిగా తన కళ్ళెదుట తిరిగే చెల్లీ.

బీడికట్టకోసం తన పర్సు తడుముతూ తన కంటపడేసరికి– 'చిల్లర డబ్బులు యేమైనా వున్నాయేమోనని–' అంటూ వెకిలిగా నవ్వడానికి ప్రయత్నం చేస్తూ– నాన్న. ..

తను తెచ్చే జీతంతో ఇల్లు గడవాల్సిన మాట నిజమే కానీ– కేవలం ఆ ఒక్క వాస్తవంకోసం– పూర్వపు అనురాగాలూ మమతానుబంధాలూ, ప్రేమలూ అన్నీ

విఫలమై విచ్ఛిన్నమై పోవాలా! అంతా యాంత్రికంగా కృత్రిమంగా తయారవ్వాలా?

చంద్రకి ఏడుపొస్తోంది.

నాన్న ఏదో అంటున్నాడు. అమ్మ వెక్కిళ్ళు హార్మనీ నొక్కులు లాగా వినిపిస్తున్నాయి.

'ఉష్.... ఏడవకే- అది లేస్తే వింటుంది, అంటున్నాడు నాన్న. ఏడుపుని ఆపుకునే ప్రయత్నంలో అమ్మ ఉచ్ఛ్వాస నిశ్వాసలు బరువుగా వినిపిస్తున్నాయి.

వరండాలో క్లాసు పుస్తకం పట్టుకుని దిక్కులు చూస్తోంది చెల్లి ఉమ. దానికి పుస్తకం మీద ధ్యాస నిలవటం లేదు. దాని మనసిప్పుడు కల్లోల సముద్రంలాగ వుంది కాబోలు, ఇంట్లో ఎదురవుతున్న పరిణామాలని చూస్తూ- ఆకళింపు చేసుకోగలిగే వయసూ, అవగాహన లేక దాని మనసు ఎంత అస్తవ్యస్తంగా తయారయిందో?

చంద్రకి పిచ్చెత్తిపోతున్నట్టనిపిస్తోంది. వెర్రిగా కేకలు వేయాలనిపిస్తోంది.

కరెంటు పోయింది.

తిరుగుతున్న ఫేను శబ్దం ఒక్కసారిగా ఆగిపోయింది. కాలమే స్తంభించిపోయినట్లయింది చంద్రకి. లేచి లైటు వెలిగించే ఓపిక లేదనిపిస్తోంది.

రెండు నిముషాలు గడిచేయి.

ఉక్కపోత భరించలేనిదిగా ఉంది.

కోడిగుడ్డు లాంతరు వెలిగించి తెచ్చి గదిలో పెట్టి వెళ్ళిపోయింది ఉమ.

నిశ్శబ్దం. ఒక మాట లేదు. పలకరింపులేదు.

తరతరాల శత్రుత్వం, ద్వేషభావం తమ మధ్య తిష్ఠవేసుక్కూచున్నట్టు-

లాంతరు పెట్టేసి వెళ్ళిపోతున్నదాన్ని జడ పుచ్చుకుని లాగి, ఆ చెంపా యీ చెంపా వాయించా లనిపించింది చంద్రకి.

'నేను నీ అక్కనే దెయ్యాన్నా! నాతో అంత నిర్లిప్తంగా ప్రవర్తిస్తావెందుకే?' అని అరవాలనిపించింది చంద్రకి.

ఉద్వేగంతో వశం తప్పిన మనసుని స్వాధీనపర్చుకోవడం సాధ్యం కావటం లేదు చంద్రకి. దబదబ తలమీద చేతుల్తో బాదుకుంటూ వెక్కి-వెక్కి ఏడవటం ప్రారంభించింది.

చంద్ర ఏడుపు విని ఇంటిల్లిపాదీ గాభరాగా అక్కడికి చేరారు.

'చంద్రా, ఏమయిందే?' అంటూ సముదాయించబోయింది తల్లి జానకమ్మ. ఒక్క విసురున ఆవిడ చెయ్యి విసిరి కొట్టింది చంద్ర.

'ఇంకా ఏం కాలేదు- కాలేదనే ఏడుస్తున్నాను' అంది రోషంగా.

'ఏమిటి తల్లీ?' ప్రవిస్తుపోతూ అడిగింది జానకమ్మ.

'నా చావు' విసురుగా వచ్చింది

జవాబు. ఆ జవాబు కసుక్కున పదునైన కత్తిలా గుండెలో దిగబడిందో యేమో- 'అయ్యో, చంద్రా' అంటూ ఏడుస్తూ కుప్పలా కూలబడిపోయిందావిడ నోట మాట రాక చూస్తూ వుండిపోయేరు అవధానిగారు.

ఈ హడావిడిలో మెలకువ వచ్చేసిన రజని భయంతో చప్పున లేచికూచుంది. అందరివేపూ భయం భయంగా చూస్తూ వుండిపోయింది. శబ్దమే తప్ప పలుకు లేని ఆ పిల్ల గొంతులోనుంచి బాధాకర మైన అస్పష్టపు ధ్వనులేవో వెలు వడ్డాయి.

చంద్ర చప్పున తలెత్తి ఆ పిల్లవేపు చూసింది. 'ఈ మూగిముండొక ర్తి- శనిలాగ నా బ్రతుక్కి దాపురించింది' కసిగా అనుకుంది. మరు క్షణంలో విలువునా కంపించిపోయింది. అంత క్రూరంగా ఆ పసిదాని గురించి ఎలా అనుకోగలిగింది? చంద్రకి తనమీద తనకే అసహ్యంగా వుంది

నోరులేని ఆ పిల్లగురించి అంత కఠినంగా, కరుగ్గా, విసుగ్గా ఎలా అనుకో గలిగింది తను? తనలోని ఆదర్శం, ఆలోచన, ఔన్నత్యం, ప్రేమ- అన్నీ ఏ మారుమూలలకి చెదిరిపోయేయి? 'నీకు స్థిరమైన నిర్ణయాలు లేవు. నమ్మిన దాన్ని ఆచరించగలిగే దృఢచిత్తం లేదు. ఆవేశం తప్ప ఆలోచన లేదు. అందో శన తప్ప అవగాహన లేదు-' అని తన మనసులో ఎవరో కేకలు వేస్తున్నట్టని పించింది చంద్రకి. బాధతో కృంగిపోతూ 'భగవాన్' అనుకుంది చంద్ర.

* * *

రజనిని తను ప్రేమించలేకపోతోంది. ప్రేమతో ఆదరించలేకపోతోంది. మరెం దుకు ఆ పిల్లను తీసుకొచ్చి యింట్లో పెట్టుకున్నట్టు? ఏం ఉద్ధరిద్దామని? ఎన్నో ఆదర్శాలుపలికి, ఎంతో గొప్పగా సూర్యం వద్దని మరీమరీ చెప్తున్నా విన కుండా ట్టుదలగా రజనిని తీసుకొచ్చింది. మొదట్లో ఎ వ రి నీ పట్టించుకోకుండా ధైర్యంగా, తన మనసుకి నచ్చినట్లు- రజనిని ఎంతో అభిమానంగా చూసు కునేది.

కాని. రానురాను తన చుట్టూ సమాజం తనవేపు వేలెత్తి చూపుతూ, హేళనచేస్తూ, తనని దోషిగా నిలబెట్టి, సిలువ వేస్తున్నట్టనిపించి- ఆ సంఘటనల పరంపరకి తట్టుకోలేకపోతోంది తను. తనలోని ఆశయాల గాలిపటాలు వాస్త వాల ముళ్ళ కంచెలకి తగులుకొని శకా? వికలైపోయాయి

పట్టుదల పట్టుతప్పి, ధైర్యం సడలి- అధైర్యం చోటుచేసుకుంటోంది. పరిస్థి తులకి ఎదురాడి పోరాడగలిగే గుండె దిటవు తనకి లేదు గాక లేదు. ఈ నిందల పల్లకి తను మోయలేదు. ఈ వెక్కి రింతల అగ్నిగుండంమీద తను నడవ లేదు. తను మామూలు మనిషి. కోరికలు,



ఆశలు, దుఃఖాలు, సంతోషాలు, స్వప్నాలు, స్వార్థాలు- అన్నీ ముప్పిరి గొంటూ వుంటే ఆకులా అల్లల్లాడిపోయే సామాన్యమయిన వ్యక్తిత్వం తనది.

కేవలం వుద్రేకం, ఏదో చేసేయాలనే తపన. ఏదో సాధించేస్తున్నానన్న అహంకారం. ఎవరిమీదో, దేనికో కసితో- క్రోధంతో ఏదో చేయడం. అంతా అయోమయం. తన మానసికస్థితి తనకే అగమ్యగోచరం. అంధకార బంధురం.

నమ్మిన విశ్వాసాలని దృఢ చిత్తంతో కడదాకా దీక్షతో నిర్వర్తించ గలగే చేవ తనకిలేదు

అది తనకి తెలుసు. తన మనసు అనుక్షణం విలదీసి ఆ విషయాన్నే ఎత్తి చూపుతూ తన గుండె గూడుపట్లను కుదిపి కుదిపి వదిలిపెడుతోంది.

అందుకే సూర్యం అన్నాడు: "చంద్రా నీకు తెలియదు - జీవితాన్ని జీవితంలాగే చూడగలగడం నేర్చుకోవాలి. జీవితం సినిమా సన్నివేశాల లాగానో, నవలల్లో దొర్లే సంఘటనల మాదిరిగానో నడిచేది కాదు. అది కఠిన వాస్తవాల పుట్ట. అందులో ఎన్నో దొంకదార్లు. ముళ్ళ పొదలు-ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వొళ్ళంతా చీరుకుపోతుంది సుమా ! నా జీవితంపట్ల యింత దయ, సానుభూతి, కరుణ చూపిస్తున్నావు. నాకది చాలు ... రజనిని చేరదీస్తే నీకెదురయ్యే పరిస్థితులు ఎంత గడ్డుగా వుంటాయో

నీకు తెలియదు. అదెన్ని బాధలు సమస్యల్ని సృష్టించి - నీ చుట్టూ ఎంత భీభత్సకర మయిన వాతావరణం ఏర్పరుస్తుందో నువ్వు ఊహించ లేకపోతున్నావు వద్దు చంద్రా-రజనిని తీసుకెళ్ళావని అనకు నాకోసం భగవంతుడు సృష్టించి ఇచ్చిన ఆ వరకంలోనే దాన్ని వుండనీ-"

తను దుఃఖంతో మైనంలా కరిగి పోయింది.

ఏం మనిషి ఇతను! కష్టం, బాధ, చికాకు- ఇన్ని అతన్ని చుట్టుముట్టి- జీవితాన్ని చిద్రుపలు చిద్రుపలు చేస్తున్నా - ఇంత నిబ్బరంగా, ఇంత ధైర్యంగా-మొండిగా-ఎలా వుండగలుగు తున్నాడు. విషాదసాగరంలో మునిగి పోతూ కూడా ఎలా నిర్వికారంగా మసలు కోగలుగుతున్నాడు! ఏమిటీతని తత్త్వం!

తను ఆవేశంతో అంది: "నా చుట్టూ సమాజం నన్నెన్ని అవహేళనలకి గురి చేసినా నేను బెదిరిపోను సూర్యం--నా నిర్ణయం మారదు. ప్లీజ్ రజనిని సంరక్షించే అవకాశం నాకివ్వు సూర్యం-నేను నీ కష్టంలో చేయూతనివ్వాలి. అంతే రజని చిన్నారిబ్రతుకు చీకటి గుయ్యారంలా తయారవడానికి వీల్లేదంతే. అహరహమూ దాని బ్రతుకులో చీకటి, నిరాశ, దైన్యం- చోటుచేసుకోడానికి వీల్లేదు. అసలే దానికి నోరివ్వకుండా భగవంతుడు తీరని ద్రోహంచేసాడు.

"కష్టంవస్తే నోరువిప్పి, ఎవరికయినా ఎలా చెప్పుకోగలదు? దాని గోడువెళ్ళని కన్నీళ్ళు తుడిచిపెట్టడానికయినా ఒక స్త్రీహస్తం అవసరం ఉందని గుర్తించ లేవా సూర్యం! ఆ స్త్రీమూర్తిని నేనే ఎందుకు కాకూడదు? రజనిని నేను సాకుతాను. ఆ పిల్ల ఆలనా పాలనా చూస్తాను. పెంచి పెద్దదాన్ని చేస్తాను. బ్రతుకులో విషాదంతో ఆ పిల్ల మానసికంగా క్రుంగిపోతూ- బ్రతుకంటే విరక్తిగా, హేయంగా, భరించలేని నరకంగా- బెదిరిపోతూ, బెంగబెంగగా కాలం గడపటాన్ని నేను ఊహించలేను సూర్యం.... నాకీ అవకాశం ఇవ్వు ఇదే నేను నా జీవితాదర్శంగా పెట్టుకుంటాను-ఎండిపోయిన నా ఎడారి మనసులో మమతల మధురిమలు నింపుకుంటాను సూర్యం అర్థంచేసుకోవూ?" అంది ఉద్వేగంగా.

సూర్యం చిన్నగా నవ్వి చూసేడు.

ఈ మనిషి గుండె ఎంత కరుకైనది! ఇలాంటి స్థితిలోకూడా ఎలా నవ్వగలుగు తున్నాడో!

'రిస్క్- తీసుకుంటున్నావు '

'ఓడిపోతావు సుమా!' అనే ధోరణిలో అతనలా అనేసరికి తన మనసు చివుక్కుమంది. పట్టుదల మరింత హెచ్చింది.

'రిస్క్-కాదు సూర్యం-ఈ పరిస్థితుల్లో ఇది నాకనీస బాధ్యతగా భావిస్తున్నాను-' అంది గంభీరతని నిలుపుకోడానికి ప్రయత్నిస్తూ.

హూర్యాన్ని ఎలాగో అంగీకరింప జేసింది. రజనిని ఓ పంచీవిండా ఆ పిల్ల బట్టలతోపాటు తీసుకొచ్చి యింట్లో దిగబెట్టాడు. ఆ రోజెంతో గర్వంగా అనిపించింది తనకి. ఏదో సాధించ బోతున్నదనే ఆలోచనలతో మనసు ఉద్రేకంతో సంబరపడిపోయింది.

"రజనిని తీసుకొచ్చేస్తూ వుంటే కాంతంగారు ఏమీ గొడవ పెట్టలేదు కదా?" అడిగింది కుతూహలంగా.

సూర్యం తన సహజ ధోరణిలో తేలికగా నవ్వేస్తూ "పెద్ద తుపాను పెట్టి వెలిసింది యింట్లో. ప్రాణనష్టం ఏదీ జరగలేదనుకో-" అన్నాడు.

అతని మాటలకి తనకి నవ్వొచ్చింది. నవ్వుతూ రజనిని దగ్గరకి తీసుకుంది.

సూర్యం వెళ్ళిపోయేక అంతవరకూ ఆ దృశ్యం ఆసక్తికరంగా చూస్తూ వుండి పోయిన తల్లీ తండ్రీ కొంచెం ముందుకు వచ్చేరు.

"ఎవరమ్మా చంద్రా - అతను?" తండ్రి అడిగేడు

చెప్పింది.

"ఈ పాప. .?" అర్ధోక్తిలో ఆపింది అమ్మ.

"ఈ పాప పేరు రజని. ఆయన కూతురు. వారి యింట్లో పరిస్థితులు ఏమీ బాగులేవు. ఆ దుర్భర వాతావరణంలో ఈ పిల్ల జీవితం ఛిన్నాభిన్నమై పోతుందని చెప్పి దీని సంరక్షణభారం నామీద వేసుకున్నాను.."

"అంటే...?" విత్తరపోతూ అడిగింది అమ్మ.

"అంటే అర్థంకాలేదా అమ్మా? ఇకపై రజని మనింట్లోనే వుంటుంది." అంది డ్రమెటిక్‌గా. తనుతెచ్చే జీతంరాళ్ళమీద బ్రతకాల్సిన అగత్యం వుండడంచేత- తనెంత నాటకీయంగా ప్రవర్తించినా, మాట్లాడినా - ఆ యింట్లో ఎవరికీ ఎదురు చెప్పే ధైర్యం, చేవ లేవని తనకి బాగా తెలుసు.

అమ్మ అచేతనస్థితిని అనుభవిస్తు న్నట్టుగా ఉండిపోయింది.

రిఅదికాదమ్మా.. ." తండ్రి ఏదో అనబోయేడు.

"నా నిర్ణయానికి తిరుగులేదు నాన్నా- మరేం చెప్పొద్దు- నా సంపాదన నలుగురికి తిండిపెట్టడంలేదూ - అందులోనే మరో ముద్ద- ఈ నోరులేని పసిదానికి చాలదా నాన్నా?"

దెబ్బతిన్న పక్షిలా విలవిలలాడి పోయేడు తండ్రి. తనంత క్రూరంగా ప్రవర్తించగలగడం తనకే రోతగా అనిపించి ఆ తరువాత చాలాసేపు గదిలో రహస్యంగా రోదించింది చంద్ర.

"పాపా .. నీ పేరేమిటమ్మా?" అడుగుతోంది ఉమ, రజనిని.

"ఆ పిల్లకి మాటలురావే. మూగది."

ఆ క్షణంలో-

ఆ గదిలో ప్రాణవాయువు ప్రసరించడం మానలేదు. కేవలం అందువల్ల

మాత్రమే అక్కడాసమయంలో మూడు ప్రాణాలు ఊపిరి నిలుపుకోగలిగాయి...

....

ఆఫీసులో కొత్తగా ట్రాన్స్ఫరు మీద వచ్చి జాయినవుతున్న గుమస్తాగా పరిచయమైన వ్యక్తిని చూస్తూనే విభ్రాంత పోయింది చంద్ర.

అతను అతను- సూర్యం!

అంత మంది మధ్య- సూర్యాన్ని పరిచయస్థుడిలా పలకరించాలో, అపరిచిత వ్యక్తిలాగా సంబోధించాలో నిర్ణయించు కోలేక తటపటాయిస్తూ వుండిపోయింది.

'నమస్తే.నా పేరు సూర్యం' నిశ్శబ్దాన్ని ప్రయ్యలుచేస్తూ అతనే మాట్లాడేడు. ముందు మౌనంగా ప్రత్యభివాదం చేసింది.

ఎన్ని జ్ఞాపకాల వంతెనలు దాటేక - మళ్ళీ ఎన్నాళ్ళకి కనిపించేడు సూర్యం! చంద్ర కళ్ళలో నీళ్ళు నిలిచాయి. ఎవరూ చూడకుండా కళ్ళు వొత్తుకుని- వశం తప్పి, చెదిరిపోతూన్న ఆలోచనల్ని, మనసునీ ఉగ్గబట్టుకోడానికి ప్రయత్నం చేస్తూ ఫైపు మిషనుమీదికి చేతులు పోనిచ్చింది.

తరువాత — సూర్యంతో వంటరిగా మాట్లాడే అవకాశం నాలుగయిదు రోజులకి కానీ కలగనేలేదు.

ఓ రోజు కాంటీన్లో కాఫీ తాగుతూ ఒక్కడూ కనిపించేడు. నెమ్మదిగా అతని ప్రక్కకి వెళ్ళి కుర్చీలో కూచుంది.

"సూర్యం-ఎలా వున్నావు?"

అదేం ప్రశ్న! నవ్వేసాడు. "మీ ఆవిడ బాగుందా సూర్యం?"

తలూపేడు.

ఓ అరక్షణం నిశ్శబ్దం వేడిగా, వాడిగా తమమధ్య తాండవించింది.

"పిల్లలెందరు?"

"ఒక్కపాప-పేరు రజని"

ఆ తరువాత ఏం మాట్లాడాలో తోచ లేదు. ఇంటికి రమ్మనయినా పిలవలేదు సూర్యం-చంద్రకి మనసంతా కల్లోలంగా తయారయింది.

సూర్యం విందుకుండలా కనిపిస్తున్నాడు కళ్ళకి ఆ పెదవులమీద చిరునవ్వు అలాగే వుంటుందెప్పుడూ. ఆ నవ్వే తనని సూర్యానికి దగ్గర చేసింది. కాని- పరిస్థితులు మాత్రం తమని దారుణంగా విడదీసాయి. సూర్యం పెళ్ళి వాళ్ళ మేనమామ కూతురుతో జరిగిపోయింది. సూర్యం తండ్రి చిక్కుకున్న ఆర్థిక విషవలయంలో సూర్యం మేనమామ చేసిన సహాయానికి ప్రతిఫలంగా సూర్యం ఆయన కుమార్తెను చేపట్టక తప్పలేదు.

తను... ?

తన మీద ఆధారపడ్డ చెల్లెల్నీ, తల్లినీ, తండ్రినీ అన్యాయం చేయలేక అవివాహితగా వుండిపోవలసి వచ్చింది. ఇలా ఎన్నాళ్ళు? ఈ త్యాగానికి ఏది పర మార్థం? తన జీవితానికి ఏది గమ్యం? ఎక్కడికి నిరవధిక యాత్రాపథం?

ఒక్కోసారి తనకి ప్రాణం కడతేరి పోయినట్లుగా అయిపోతుంది. మనసు

చించుకున్నట్టుగా గందరగోళంగా తయారవుతుంది.

ఎవరూ తన భవిష్యత్తు గురించీ, వివాహం గురించి, సుఖం గురించీ పట్టించుకోవటం లేదన్న ఆలోచన వచ్చి నిలువునా దహించుకు పోతున్నట్లని పిస్తుంది. అసలా ఆలోచన మనసులకి తరిదాపుగా రానివ్వడానికే భయంతో కంపించిపోతున్నట్లు కనిపిస్తారు.

ఒక్కో ఆవేశపుక్షణంలో - జీవితం మీద విరక్తి పెచ్చుపెరిగిపోయి-అందర్నీ పేరుపేరునా తిట్టిపోయా లనిపిస్తుంది. చుట్టూ వెలుగు ప్రసరింపజేస్తూ తనెం దుకు కొవ్వొత్తిలా హరించుకు పోవాలని పిస్తుంది. ఏడుపొస్తుంది. పిచ్చెత్తినట్టు అరవాలనిపిస్తుంది.

కాని-వారి ప్రవర్తనలో నిబిడీకృత మైన దైన్యం అవసరం గుర్తొచ్చి మన సంతా ఆర్ద్రీభూతమై చలించిపోతుంది.

తన ఆవేదన తనలోనే అణచుకుని తన విషాదం తనకే మిగుల్చుకుని-ఇలా నిస్సారంగా కాలం గడపాల్సిందే.

కాని-జీవితం ఎంత విచిత్రమైనదో!

తనవాడు కాకుండా పోయిన సూర్యం కూడా-సంసార జీవితంలో ఎన్నో ఒడిదుడుకులనీ, కష్టాలనీ - అనుభవిస్తు న్నాడని తెలుసుకుని నివ్వెరపోయింది.

ఆ గంభీరత వెనుక ఎంత దీనత్వం!

ఆ చిరునవ్వు వెనుక ఎంత విషాదం!

ఇంటి పరిస్థితుల గురించి సూర్యం ఎప్పుడూ పెదవి విప్పి ఒక్కమాట కూడా అనలేదు. ఒక్కసారి కూడా తన బాధలు వెళ్లబోసుకోలేదు-

సూర్యం గురించి ఆఫీసులో అంతా తలోరకంగా వ్యాఖ్యానాలు ప్రారంభిం చేరు. ఎవర్నీ ఎప్పుడూ యింటికి పిలవ డనీ-ఎవరయినా ఆ ప్రసక్తి తీసుకొస్తే దాటవేస్తుంటాడనీ - భార్యని నలుగుర్లోకి తీసుకురాని మూర్ఖుడనీ-ఒట్టి అనుమానపు మనిషి అనీ - అతని భార్య బొత్తిగా అనాకారి అనీ - ఆమెని అస్తమానం గొడ్డుని బాదినట్టు బాదుతూ హింసిస్తూ వుంటాడనీ-ఇలా ఎన్నెన్నో-

ఇవన్నీ తెలిసి కూడా సూర్యం పట్టించుకోలేదు. నిర్వికారంగా ఊరు కుండేవాడు.

కనీసం తననయినా యింటికి పిలవ లేదు సూర్యం. తనే కుతూహలం చంపుకోలేక అతని యిల్లు కనుక్కుని, తనంతట తానుగా వెళ్ళింది.

వెళ్ళి ?

అక్కడ పరిస్థితి చూసి విస్తుపో యింది. నిబ్బరంగా, ధైర్యంగా కనిపించే సూర్యం-అంతరంగంలో ఎన్ని వ్యధలకి లోనవుతున్నాడో స్వయంగా చూసి ప్రాన్పడిపోయింది.

సూర్యం భార్య-మతిస్తిమితంలేని మనిషని గ్రహించి చంద్రకి గుండె ఆగినంతపనయింది. ఆవిడకా లక్షణాలు చిన్నప్పటినుంచీ వున్నాయనీ-వివాహం

అయ్యేక మరింత విజృంభించాయనీ తెలిసికొని వణికిపోయింది చంద్ర

అంతేకాదు—

సూర్యం కూతురు రజని—ఆ పిల్ల మూగదని తెలిసాక చంద్రని ఎవరో ఛెళ్ ఛెళ్‌మని కొట్టి హింసిస్తున్నట్టుగా వేదన కలిగింది.

ఆపిల్ల తల్లిచేత దెబ్బలు తినని రోజు లేదుట. ఉన్మాదంలో చేతికందిన వస్తువుతో పిల్లని కొడుతుందిట ఆమె. కన్నబిడ్డ అనే గ్రహింపు కూడా లేకుండా ప్రవర్తించే ఆమెతో సూర్యం ఎన్ని ఆరాటాలకి లోనవుతున్నాడో—ఎంత యాతనకు గురవుతున్నాడో తలుచుకుంటే గుండె ద్రవించుకుపోయింది చంద్రకి.

తల్లి అనాదరణతో- ఇంట్లో అనుక్షణం నరకంగా మారే ఆ దుర్భర వాతావరణంలో మానసికంగా చితికిపోయి - తిన్నది హితవుకాక- రజని ఎండిన పుల్లలా - కళ్ళలో జీవం విలుపుకొని కనిపించేసరికి తను మనసు నిగ్రహించుకో లేకపోయింది.

ఆ పిల్ల నెలాగయినా తను రక్షించాలనీ - ఆ పిల్ల బాగోగులు చూసే బాధ్యత తను తీసుకోవాలనీ—ఆ విధంగా సూర్యం మండే గుండెకి పూరట కలిగించాలనీ అనిపించింది.

ఇదే విషయం సూర్యంతో చర్చించి, సూర్యం చెప్పినా వినకుండా ఎన్నో ఆదర్శభావాలతో - ఎంతో ఉన్నతమయిన ఆలోచనలతో- ధైర్యంగా రజని బాధ్యత స్వీకరించింది.

అంతే...

కాని రజని యింట్లోకి వచ్చిన తరువాత కానీ సూర్యం మాటల్లోని చేదు సత్యాలు, జీవితానుభవం గుర్తింపుకి రాలేదు.

ఉద్వేగంతో, ఒక మంచి పని చేయాలన్న ఆరాటంతో తను చేసినదానికి ఎన్ని ప్రతిఘటనలు ఎదురవుతాయో ఊహించలేకపోయింది. తీరా ఆ పరిస్థితి ఎదురై ఉక్కిరి బిక్కిరి చేస్తూవుంటే నిలద్రొక్కుకునే గుండెదిటవులేక కంపించిపోతోంది తను.

ఆఫీసులోనూ, బయటాకూడా తన గురించి రకరకాల వదంతులు బయలు దేరాయి. రజనిని అడ్డంగా పెట్టుకుని పిచ్చిభార్యతో వేగలేకపోతున్న సూర్యాన్ని తనవెంట తిప్పుకుంటోందని అంతా రకరకాలుగా నీచంగా చెప్పుకోవటం, అనటం ప్రారంభించేరు. సూర్యం కుటుంబ పరిస్థితి ఎంత గోప్యంగా వుంచినా ఆ విషయాలన్నీ కూపీలాగందే నిద్రపట్టని మనుషులు తలో రాయి విసరటం ప్రారంభించేరు. తన యింట్లో అమ్మకీ నాన్నకీ కూడా ఆ పిల్లని తను చేరదీయడం సుతరామూ యిష్టంలేదు. తన అభిప్రాయం వెల్లడించుకోలేని



పిరికితనంతో వాళ్ళు లోలోనే సతమత మైపోతూవుండటం గమనిస్తూనే వుంది

ఆ ములుకుల్లాంటి మాటలు, నిందలు అంతై యింతై తనని చుట్టుముట్టి రోజు రోజుకి ఊపిరాడనివ్వకుండా చేస్తు న్నాయి ఈ పరిస్థితిని ఎదుర్కొ గలిగే సత్తా తనకి లేకపోతోంది.

తన చుట్టూ పరిస్థితులు వికటించి, హేళనలు ప్రతిమించి-తను మానసికంగా వ్యధకి లోనవుతూ వుంటే - ఒకో్క సారి రజని బాధ్యతను తను స్వీకరించడం పొరపాటేమోనని కూడా అనిపించ సాగింది .

అన్యాయంకాదూ! మరెందుకు రజనిని గొప్పగా తీసుకొచ్చినట్టు? తన చిత్త ప్రవృత్తి తనకే అవగతం కావటం లేదు. తన మనస్థితి తనకే రోతగా వుంది. వెగటు కలిగిస్తోంది.

ఏ సమాజాన్ని ఖాతరుచెయ్యకూడ దని గర్వించిందో- ఆ సమాజాన్ని చూసే తనిప్పుడు బెదిరిపోతోంది. గజ గజా వణికిపోతోంది. పిరికిగా దాని నీడ కూడా తనమీద పడటాన్ని భరించలేక పోతోంది.

సూర్యం చెప్పే మాటలు పదే పదే గుర్తొస్తున్నాయి:

'జీవితం మనం చెప్పేలా నడిచేది కాదు చంద్రా- జీవిత వాస్తవాల కఠిన శిలల తాకిడికి తట్టుకోడానికి సతతమూ సిద్ధంగానే వుండాలి. అదే అనుభవం. ఆదర్శం వేరు. ఆచరణ వేరు. రెంటికీ మధ్య అనంతమయిన అగాధం వుంది. ఊహ వేరు- వాస్తవం వేరు. ఏదో అనుకుంటాం. ఏదో సాధిస్తామనీ - సాధించగలమనీ- అందుకు మార్గం సుందరంగా, సూటిగా, సజావుగా

వున్నట్టుగా కనిపిస్తుంది. కాని- ప్రయత్న సాఫల్యంలో తమ యాత్రాపథంలో ఎదురయే కష్టాలు- అటుపోటులు- వీటికి తట్టుకోగలగడం చాలా కష్టం- అందుకెంతో ధైర్యం, పట్టుదల, ఆత్మశక్తి, అవగాహన వుండాలి....'

విజయం....

తనలో ఉద్రేకం తప్ప అభినివేశం లేదు. ఆశయం తప్ప — సమ్యగవగాహన లేదు. అందుకే ఓడిపోయింది తను....

ఇంక- రజనిని తను యింట్లో ఒక్క-క్షణం కూడా వుంచుకోలేదు. చంద్ర కళ్ళనుంచి వెచ్చగా కన్నీరు వరదగా ప్రవహిస్తోంది.

కరెంటు వచ్చి, లైటు వెలిగింది. ఫేను మళ్ళీ శబ్దంచేస్తూ తిరగటం ప్రారంభించింది. చంద్ర పమిటతో ముఖం తుడుచుకుంది. అలారం పీసు వేపు చూసింది.

పదవుతోంది. మరో గంటలో జనతా బయల్దేరుతుంది.

సూర్యాన్ని కలియాలి తన అశక్తతనీ, అసమర్థతనీ అంగీకరిస్తూ రజనిని అప్పగించా లతనికి....

సూర్యం భార్యతోపాటు వెళ్ళిపోతున్నాడు. అంతటా నిప్పులు చెరిగినట్లు చెలరేగిన పుకార్లతో — సిగ్గుతో, అవమాన భారంతో క్రుంగిపోతున్న తన ముఖంలోకి చూడలేక - ప్రయత్నంమీద బదిలీచేయించుకుని మరీ వెళ్ళిపోతున్నాడు.

వెళ్ళి, రజనిని అప్పగించాలి. సూర్యం ఏమనుకుంటాడో ? తనని చూసి నవ్వుకుంటాడేమో ? ఎన్నో ఆదర్శాలు వల్లించి, డాంబికాలు పలికిన తను - ఇప్పుడిలా అర్థాంతరంగా 'నీ ఖర్మ నువ్వు అనుభవించు' అన్నట్టుగా రజనిని, ఆ నోరులేని పసిపిల్లను- తిరిగి ఆ పిచ్చి తల్లి బారిని పడేస్తూవుంటే - సూర్యం ఎంత బాధపడతాడో ? తననెంత చులకనగా చూస్తాడో ?

'కాని, తప్పదు -' నీరసంగా అనుకుంది చంద్ర - ఈ పిల్లని యింట్లో వుంచుకుని తను మరింక యీ ఎదురు తిరిగే కలతల సముద్రాలని అధిగమించలేదు. అవమానాలని, దూషణలని, తిరస్కారాలనీ, తట్టుకుని భరించగలిగే దృఢసంకల్పం, ఆత్మస్థయిర్యం తనకి లేవు గాక లేవు.

ఒక నిర్ణయానికి వచ్చినదానిలా చప్పున మంచంమీద నుంచి లేచింది చంద్ర. ముఖంమీద నీళ్ళు చల్లుకుంది. రేగిపోయిన జుత్తుని చేత్తో సవరించుకుంది.

రజని బొంతమీద అమాయకంగా నిద్రపోతూంది తల్లిదగ్గర లభించని భద్రతని సంతోషంగా అనుభవిస్తున్నట్టుగా విశ్రాంతిగా పడుకునివుంది.

చంద్ర భారంగా నిట్టూర్చింది.

రజనిని లేపింది. ఆ పిల్ల బట్టలన్నీ పంచీలో సర్దింది. రజని అయోమయంగా చూస్తూ వుండిపోయింది

జానకమ్మ వచ్చి ద్వారానికి ఆనుకుని ఆశ్చర్యంగా యిదంతా చూస్తోంది.

"రజనిని సూర్యానికి అప్పగించి వస్తాను." ముక్తసరిగా చెప్పి రజనితో పాటు బయల్దేరింది చంద్ర.

* * *

చంద్ర రజనితో స్టేషనుకి చేరేసరికి రైలు వచ్చి ఆగివుంది. సూర్యం భార్య కిటికీ దగ్గర కూచుని ఎటో వెర్రిచూపులు చూస్తోంది. సూర్యం ప్లాట్ ఫారం మీద నిలబడి వున్నాడు.

"సూర్యం... " పిలిచింది చంద్ర.

ఎటో చూస్తున్నవాడల్లా ఆ పిలుపుతో అటు చూసేడు. "చంద్రా - వచ్చేవా!" అన్నాడు, తను రావటం తప్పదని గ్రహించినట్లు. ఆ గొంతులో ఆత్రత లేదు. ఆశ్చర్యం లేదు. తొట్రుపాటు లేదు.

"ఇదిగో, రజని .. రజని...." ఏం చెప్పాలో తెలీక సగంలో ఆపేసింది చంద్ర ఆమె గుండె సహస్రసదా ఛిద్రమైపోతున్నట్టనిపించింది. మాటలు గొంతు దాటి వెలువడలేదు కళ్ళు ధారాపాతంగా వర్షించసాగాయి

"బాధపడకు చంద్రా - రజని బాధ్యత నువ్వు స్వీకరిస్తానన్నప్పుడు దాని భవిష్యత్తు బాగుండదేమోనన్నదని నేనుకూడా కొంచెం అశపడ్డమాట నిజం. కాని.... రజని నీకు కూడా భారంగా, ఒక తీరని సమస్యగా అవుతుందని నాకు తెలుసు. ఆ పరిస్థితులకి తట్టుకునే నిబ్బరం నీకుండదనీ - రజనిని తిరిగి అప్పగిస్తావనీ తెలుసు..."

చంద్ర ఆశ్చర్యంగానూ అయోమయంగానూ అతని వేపు చూడసాగింది.

"అందుకే చంద్రా - ఇదిగో మొత్తం మూడు టిక్కెట్లు తీసుకున్నాను. రెండు మాకూ- అరటిక్కెట్టు రజని కోసమూ"

ఆ మాటలు వింటూనే భళ్ళున రోదించసాగింది చంద్ర. "ఛ- ఊరుకో చంద్రా- ఇప్పుడేం జరిగిందనీ-" ఓదార్చడానికి ప్రయత్నించాడు సూర్యం.

"సూర్యం నీ గుండె బద్దలయిపోవటం లేదూ? నీకు దుఃఖం రావటం లేదూ!" వెక్కిళ్ళ మధ్య అడిగింది చంద్ర.

సూర్యం పెదవులమీద ప్రాణవంతమయిన చిరునవ్వు మెరిసి మాయమైంది.

చిమ్మెన ఉబికివస్తున్న కన్నీటి తరంగాల మధ్య సూర్యం రూపం మహోన్నతంగా గోచరించింది చంద్రకి.

'ఈ మనిషికి ఎప్పటికీ అర్థం కాడు' అనుకుంది మనసులో.

అవును -

సూర్యుడికి చీకటేమిటి?

———